ప్రజాశక్తి

శనివారం 20 జూలై 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

వీడని ముసురు

విస్తారంగా వర్షాలు • పొంగుతున్న వాగులు, డ్రైన్లు
• పలుచోట్ల నీట మునిగిన పొలాలు • స్తంభించిన జనజీవనం
• కృష్ణాలో 21.9 మిమీ వర్షపాతం • ఎన్‌టిఆర్‌లో 25.13 నమోదు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కృష్ణాజిల్లాలో గురువారం ఉదయం 8.30 నుంచి శుక్రవారం ఉదయం 8.30 వరకు గడిచిన 24 గంటల్లో 21.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బంటుమిల్లిలో 38.4 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా చల్లపల్లిలో 10.4 వర్షపాతం నమోదైంది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో సగటు వర్షపాతం 25.13 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా మొత్తంగా 502.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా తిరువూరులో 34.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా జగ్గయ్యపేటలో 14.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా తూర్పు డెల్టాలోని కాల్వలు, డ్రెయిన్లు పొంగాయి. కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేట, లజ్జబండ డ్రైన్లలో నీరు పొంగుతోంది. తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోయి ఉండటంతో నీరు కదలడం లేదు. మల్లేశ్వరం నుండి వచ్చే మైనర్ డ్రైన్ నీరు నాగేశ్వరరావు డ్రైన్లోకి వచ్చి (మిగతా 2లో)



వరిపొలాలు మునక

ప్రజాశక్తి - కోడూరు : గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోడూరు శివారు హంసలదీవి, పాలకాయతిప్ప, దింటిమేరక గ్రామాల సమీపంలోని వరి పొలాలు నీట మునిగాయి. పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడవడంతోపాటు సముద్రపు పోట్లకు ఉప్పునీరు ఎగువకు చేరడంతో పొలాలు ముంపుబారిన పడ్డాయి. దిగువకు వర్షం నీరు వెళ్లే పరిస్థితి లేక పొలాలు మునిగిపోయాయని రైతులు తెలిపారు. నారుమడులు పోసే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు వరి పొలాల ముంపు సమస్యకు త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో వర్షపాతం

మండలం	వర్షపాతం (మిమీ)
తిరువూరు	34.8
రెడ్డిగూడెం	32.2
విజయవాడ రూరల్	31.6
ఇబ్రహీంపట్నం	30.2
గంపలగూడెం	29.8
విస్సన్నపేట	28.6
చందర్లపాడు	28.2
విజయవాడ తూర్పు	26.2
విజయవాడ దక్షిణం	26.0
విజయవాడ సెంట్రల్	25.6
విజయవాడ పశ్చిమం	25.6
కంచికచర్ల	25.2
మైలవరం	24.8
ఎ కొండూరు	23.4
వీరులపాడు	23.0
నందిగామ	22.8
పెనుగంచిప్రోలు	18.8
జి కొండూరు	15.8
వత్సవాయి	15.2
జగ్గయ్యపేట	14.8

కృష్ణాజిల్లాలో వర్షపాతం

మండలం	వర్షపాతం (మిమీ)
బంటుమిల్లి	38.4
కృత్తివెన్ను	36.2
పెదపారుపూడి	32.2
మచిలీపట్నం	28.6
మొవ్వ	27.0
గుడివాడ	25.8
నాగాయలంక	24.8
గుడ్లవల్లేరు	22.8
పమిడిముక్కల	22.8
గన్నవరం	22.6
కంకిపాడు	22.4
గూడూరు	22.0
ఉంగుటూరు	21.8
పెనమలూరు	21.0
బాపులపాడు	20.8
తోట్లవల్లూరు	18.8
ఉయ్యూరు	18.8
పామర్రు	18.4
కోడూరు	15.2
అవనిగడ్డ	14.6
పెడన	14.6
మోపిదేవి	13.2
ఘంటసాల	12.6
చల్లపల్లి	10.4

అనవసర ప్రయాణాలు వద్దు : కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-గంపలగూడెం : విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. పలుచోట్ల వరద ఉధతితో ప్రజల రాకపోకలకు ఆటంకం ఏర్పడిందన్నారు. శుక్రవారం ఆమె ఏ కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లో పర్యటించారు. ఈసందర్భంగా వినకడప కట్టలేరు వంతెన వద్ద వాగు ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర ప్రయాణాలను మాత్రమే చేయాలని సూచించారు. రోడ్లు, భవనాల ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. కలెక్టర్ వెంట తిరువూరు ఆర్డీవో కొత్త మాధవి, గంపలగూడెం తహశీల్దారు డి సుగుణ ఉన్నారు.

కట్టలేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన



అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - గన్నవరం : విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరంలోని ఎంపీడీవో కార్యాలయం నుండి రెవెన్యూ డివిజన్ల అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తాసిల్దారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా (మిగతా 2లో)




గంజాయి కేసుల్లో 19 మంది అరెస్టు

90 కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ : గంజాయి కేసుల్లోని 19 మంది నిందితులను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ పరిధిలో 15 మందిని, గన్నవరం మండల పరిధిలో నలుగురిని అరెస్టు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా యాంటి నార్కోటిక్ సెల్, శాంతిభద్రతల బందాలు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని కమాండ్ కంట్రోల్‌లో శుక్రవారం డిప్యూటీ పోలీస్ కమిషనర్ హరికృష్ణ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. రాష్ట్ర డిజిపి ఆదేశాల 100 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పర్యవేక్షణలో సిటీ టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, సరఫరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు గతంలో పలు అక్రమ మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకుని తిరుగుతున్న, గంజాయి సరఫరాలో (మిగతా 2లో)



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిసిపి హరికృష్ణ



ఏలూరు కాల్వగట్ల వెంబడి గాలిస్తున్న పోలీసు సిబ్బంది; ఎంపిడిఒ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌ఎ బోడే ప్రసాద్ (కింది ఫొటో)



ఎంపిడిఒ కోసం గాలింపు ముమ్మరం

సిసి కెమెరాల పరిశీలన

ప్రజాశక్తి - గన్నవరం, కంకిపాడు : నర్సాపురం ఎంపిడిఒ ఎం.వెంకటరమణారావు అదృశ్యంపై శుక్రవారం కూడా కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గాలింపు చర్యలు కొనసాగించారు. ఏలూరు రేంజ్ ఐజి జీవిజీ అశోక్ కుమార్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల ఎస్‌పిలు ఆర్.గంగాధరరావు, అద్నాన్ నయీమ్ హస్మి ప్రత్యక్ష పర్యవేక్షణలో గన్నవరం డిఎస్‌పి జయసూర్యతోపాటు నలుగురు డిఎస్‌పిలు, ఐదుగురు సిఐలు, 15 మంది ఎస్‌ఐలు, 250 మంది సిబ్బందితో వివిధ బందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు ముమ్మరం (మిగతా 2లో)

రేపు 'వైతాళికుల' కొలువు

ప్రజాశక్తి - విజయవాడ : చుట్టూ చీకటి అలముకొని ఉన్నప్పుడు, ఏ మార్గం కనపడక జనం నానా పాట్లూ పడుతున్నప్పుడు వెలుగు దారి వైపు మేల్కొల్పిన మహానుభావులు వైతాళికులు. అలాంటి దీపధారుల చిత్రపటాలను ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో ఆవిష్కరించనున్నారు.

తెలుగు నాట ఒక్కో కాలంలో ఒక్కో అవసరం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహాయోధులు ఎందరో ఉన్నారు. సమాజంలో అజ్ఞానాంధకారాలు ప్రబలంగా ఉన్నప్పుడు, దురాచారాలు చెలరేగుతున్నప్పుడు తమ మాటలతో, చేతలతో, రచనలతో ఎదురు నిలబడ్డారు వారు. ఆనాటి పాలకులు, దుస్సంప్రదాయాల ప్రేమికులూ ఎన్ని ఆటంకాలు కల్పించినా, దాడులు చేసినా పిసరంత కూడా భయపడలేదు. పట్టుదలతో నమ్మిన బాటలో పయనించి, తెలుగు సమాజానికి వెలుగు దారులు పరిచారు. వేమన, కందుకూరి, పోతులూరి, గురజాడ, గిడుగు, చిలకమర్తి, బండారు అచ్చమాంబ, కొమర్రాజు లక్ష్మణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, కుసుమ ధర్మన్న, త్రిపురనేని (మిగతా 2లో)

ఫోర్‌వీలర్ సర్వీస్, డిజిటల్ మార్కెటింగ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యాన విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలోని స్కిల్ హబ్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్స్ నాలుగో బ్యాచ్ ను, డిజిటల్ మార్కెటింగ్ మూడో బ్యాచ్‌ను ప్రారంభించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ తెలిపారు. నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఇప్పటికే వివిధ రకాల ఆన్లైన్, ఆఫ్లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తాగాజా ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, డిజిటల్ మార్కెటింగ్ కోర్సులకు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వనరులు, బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను దష్టిలో పెట్టుకొని యువతకు డిమాండ్ ఉన్న కోర్సులో మూడు నెలలపాటు నైపుణ్య శిక్షణ కల్పించి వారిని స్థానికంగా, ఇతర రాష్ట్రాల్లోని కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి కలిగిన యువతీ యువకులు తమ విద్యార్హత ఆధారంగా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్‌కు 8 నుండి 10వ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, డిజిటల్ మార్కెటింగ్‌కు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ విద్యార్హతగా ఉందని తెలిపారు. ఉత్సాహవంతులైన అభ్యర్థులు https://forms.gle/RfUQjn9yVTKLTFTcA లింక్ ఫైక్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 9985759304, 8008742842, 9347779032 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యకర సమాజానికి ప్రజల భాగస్వామ్యం అవసరం

కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - విజయవాడ : ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రజా భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడ రామకష్ణాపురంలో విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తదితర విభాగాల ఆధ్వర్యంలో ఫ్రైడే-డ్రై డేలో భాగంగా శుక్రవారం చేపట్టిన కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడకుండా విస్తత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. బుడమేరులో నీటి ప్రవాహం సరిగా ఉండేలా ప్రత్యేక యంత్రాల సహాయంతో గుర్రపు డెక్క, తూటికాడలను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో విఎంసి ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేశ్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్టు) కేవీ సత్యవతి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, విఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, బయాలజిస్ట్, జిల్లా సహాయక మలేరియా అధికారి సూర్యనాయక్, డీపీఎంవో డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో మంచినీటి నమూనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన



పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ శుక్రవారం గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయంగా వర్షం పడుతున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



11 ఫిర్యాదులను స్వీకరించిన సిపి

ప్రజాశక్తి - విజయవాడ : పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు శుక్రవారం 11 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన డిసిపి గౌతమి శాలి

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా శాంతి భద్రతల డిప్యూటీ పోలీసు కమిషనర్ (డిసిపి)గా గౌతమి శాలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గల తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన ఆమె అనంతపురం జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆమె గతంలో విశాఖపట్నం డిసిపిగా, అనకాపల్లి ఎస్‌పిగా పనిచేశారు. డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



మొదటిపేజీ తరువాయి

వీడని ముసురు

చేరడంతో బంటుమిల్లి ప్రాంతంలో వెద పద్ధతిలో వరి పండించే 150 ఎకరాలు నీట మునిగాయి. ఇంకా పలుచోట్ల కాల్వలు, డ్రైన్లలోని నీరు పొలాల్లోకి చేరుతోంది. వెద పద్ధతిలో వేసిన వరి పొలాలు, వరి నారుమళ్లు, నాట్లు వేసిన లక్ష ఎకరాల్లో ఇప్పటికే నీరు అధికంగా చేరింది. పొలాల్లోని నీటిని వెలుపలకు పంపేందుకు రైతులు శ్రమిస్తున్నారు. వర్షం పెరిగితే పంటలు ముంపుకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్తంభించిన జనజీవనం

విజయవాడ నగరంలో డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పల్లపు ప్రాంతాల్లోని వీధులు, పలు రహదారులు జలమయం అయ్యాయి. నగరం చిత్తడిగా మారింది. జనజీవనం స్తంభించింది. 51వ డివిజన్ కొండ ప్రాతంలో ఓ ఇంటి ఫెన్సింగ్ జారిపోయింది. చిరు వ్యాపారాలు, భవన నిర్మాణ కార్మికులు, వృత్తులపై ఆధారపడి పని చేస్తున్న కార్మికుల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఏ రోజుకారోజు రెక్కాడితేనే కానీ కుటుంబం గడవని స్థితిలో ఉన్న కార్మికులు పనులు ఆగిపోయి కూలి డబ్బులకు గండిపడింది. ఎక్కడ నీరు అక్కడే ఆగిపోయి, డ్రైన్లు పొంగిపొర్లుతూ రహదారులు తటాకాలుగా దర్శనమిస్తున్నాయి.

పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఎన్.పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి, కృష్ణాజిల్లా

వర్షాలకు పొలాల్లో అధికంగా నీరు చేరుతోంది. పంటలు మునగకుండా పొలాల్లో నిలిచిన నీటిని డ్రైన్లలోకి మళ్లించాలి. వర్షాలు కొనసాగుతుంటే ముంపును తట్టుకునే ఎంటియు 1140, 1232, రకం విత్తనాలను సాగు చేసుకోవాలి. ముంపుకు గురైన నారుమళ్లలో వ్యవసాయ అధికారుల సూచనలతో సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.

గంజాయి కేసుల్లో 19 మంది అరెస్టు

కీలకంగా ఉన్న ఒరిస్సాకు చెందిన పింకి రౌత్‌తోపాటు మరో 14 మందిని అరెస్టు చేశారు. మాచవరం, సుర్యరావుపేట, భవానీపురం, కష్ణలంక పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వేర్వేరు ప్రదేశాల్లో వీరిని అరెస్టు చేసి వారి వద్ద నుండి సుమారు 90.5 కిలోల గంజాయిని, దొంగిలించిన ఒక యాక్సిస్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో నమోదైన గంజాయి కేసులకు సంబంధించి ఒరిస్సా రాష్ట్రం బరంపూర్‌కు చెందిన పింకి రౌత్‌పై కీలక నిందితుడిగా ఉన్నాడు. మాచవరం పిఎస్ పరిధిలో నమోదైన కేసుల్లో పింకితోపాటు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గోగినేని మాధవరావు అలియాస్ మాధవ, కష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన షేక్ మొహమ్మద్ గౌస్, అబ్దుల్ హబీబ్, విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన మర్రి రఘురాం అలియాస్ రఘు, విజయవాడ మాచవరం డౌన్‌కు చెందిన కొమ్ము రాకేశ్‌లను అరెస్టు చేశారు. అలాగే సుర్యారావుపేట పిఎస్ పరిధిలో తెలంగాణా రాష్ట్రం మేడ్చల్ పోతయిపల్లికి చెందిన మురుగన్ మణికంఠ అలియాస్ మ్యాక్సి అలియాస్ మణి, సంకేలి గణేష్ అలియాస్ గణి, భవానీపురం పిఎస్ పరిధిలో విజయవాడ భవానిపురంకు చెందిన పాలెటి మమత రాజు అలియాస్ మమత, మహమ్మద్ ముజ్జమిల్ సుల్తాన్, షేక్ నజీర్, మత్తే నాని, ఇల్లురి మధుసూదన్ రెడ్డి అలియాస్ మధు, కష్ణలంక పిఎస్ పరిధిలో కష్ణలంక కు చెందిన అడపాల వంశీ అలియాస్ పండు, అమన్ సింగ్ అలియాస్ మోనోను అరెస్టు చేశారు. వీరంతా వేర్వేరు మార్గాల ద్వారా గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి విజయవాడలోని పలు ప్రాంతాల్లో యువకులకు విక్రయిస్తున్నారు. నిందితులు బరంపురం సమీపంలోని పూల్బాని ఏజెన్సీ, సీలేరు ప్రాంతాల నుండి కీలక నిందితుడైన ఒరిస్సాకు చెందిన పింకి రౌత్‌తోపాటు గంజాయిని సేకరించి ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. మరికొంత మంది నిందితులు పరారీలో ఉన్నారు. గంజాయి సాగు, మత్తుపదార్థాల రవాణా, విక్రయం, సేవించడం వంటి సమాచారాన్ని తెలియజేయాలని, వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డిసిపి కోరారు. సెల్ నెంబర్ 9121162475కు గానీ, మెయిల్ ఐడి antinarcoticcell@vza.appolice.gov.in కుగానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా కష్ణానది పరీవాహక లోతట్టు ప్రాంతాలు, లంక గ్రామాలపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. పాకలు, పూరిళ్లలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గర్భిణులు, డయాలసిస్ రోగులను దగ్గరలోని పిహెచ్‌సిలకు తరలించాలన్నారు. అన్ని పిహెచ్‌సిల్లో అవసరమైన మందులను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన రేషన్ సరుకులను అందుబాటులో ఉంచుకోవాలని, సూచించారు. రక్షిత మంచినీటి పథకాలకు ఎలాంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, స్టోరేజ్ ట్యాంకులు, చెరువులు నింపుకొని నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, విద్యుత్తుకు అంతరాయం లేకుండా పడిపోయిన స్తంభాలను పునరుద్ధరించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. రోడ్లపై పడిపోయిన చెట్లను వెంటనే తొలగించే విధంగా అవసరమైన రంపాలు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బలహీనంగా ఉన్న కాల్వలు, చెరువు కట్టలను నిరంతర పర్యవేక్షించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎంపిడిఒ కోసం గాలింపు ముమ్మరం

చేశారు. ఈ కేసును వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. కృష్ణాజిల్లాలో నాలుగో రోజూ ప్రత్యేక బందాలతో ముమ్మరంగా గాలించారు. విజయవాడ మధురనగర్ బ్రిడ్జి వద్ద నుండి ఏలూరు వరకు ఏలూరు కాల్వలో 65 కిలోమీటర్ల మేర రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, మూడు ఎస్‌డిఆర్‌ఎఫ్ బందాలు కలిపి మొత్తం 50 మంది సిబ్బంది, 5 బోట్ల సహాయంతో గాలిస్తున్నారు. ఏలూరు కాల్వలో గన్నవరం మండలం కేసరపల్లి నుండి హనుమాన్ జంక్షన్ పెరికీడు వంతెన వరకు, బుడమేరు వాగులో గాలించారు. పలుచోట్ల గుర్రపుడెక్క అధికంగా ఉండడంతో గాలింపు చర్యలు ఆలస్యం అవుతోంది. అయితే ఇరిగేషన్ సిబ్బంది సహకారంతో గుర్రపు డెక్కను తొలగించి వెతుకులాట ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి మూడు, కష్ణాజిల్లా నుండి మూడు డ్రోన్ కెమెరాలతో ఏలూరు కాల్వ పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. ఎంపిడిఒ ఫోన్ జిపిఆర్ఎస్, ఐపిడిఆర్ (ఇంటర్నెట్ ప్రోటోకాల్ డీటెయిల్ రికార్డ్) సమాచారాన్ని క్షణక్షణం సేకరిస్తున్నారు. ఆయన మాట్లాడిన ఫోన్ కాల్ సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. అంతేకాక ఇంకా వేరే ప్రదేశాల్లో ఎక్కడైనా సంచరించి ఉంటారేమో అనే కోణంలోనూ విచారణను ముమ్మరం చేశారు. ఆయన ఫోన్ సిగ్నల్ లాస్ట్ అడ్రస్ ముగిసిన ఏలూరు కెనాల్‌కు అనుసంధానం కలిగిన అన్ని అప్రోచ్ రోడ్లలో గల సిసి కెమెరాలను, విజయవాడ నగరంలోని సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజల వద్ద నుండి సమాచారం సేకరిస్తున్నారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఎంపిడిఒ కుమారుడికి వాట్సాప్‌లో పంపిన సూసైడ్ నోట్ ఆధారంగా, ఆయన విధులు నిర్వహించిన కార్యాలయంలో విచారణ జరుగుతోంది.

ఎంపిడిఒ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నిమ్మల

అదశ్యమైన ఎంపిడిఒ వెంకటరమణ రావు కుటుంబ సభ్యులను శుక్రవారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పెనమలూరు ఎంఎల్‌ఎ బోడె ప్రసాద్ పరామర్శించారు. పెనుమలూరు మండలం కానూరులోని ఎంపిడిఒ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్యపడవద్దని ధైర్యం చెప్పి ప్రభుత్వం అన్ని రకాలుగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కేసు దర్యాప్తు పురోగతి గురించి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఫోన్లో మాట్లాడారు.

రేపు 'వైతాళికుల' కొలువు

రామస్వామి తదితరులు తెలుగు నాట కొత్త ఆలోచనలు మొలకెత్తించారు. తాపీ ధర్మారావు, గరిమెళ్ల సత్యనారాయణ, గుడిపాటి, గుర్రం జాషువా, బోయి భీమన్న వంటివారు సమాజంలో చైతన్యం రగిలించారు. ఇంకా సుంకర సత్యనారాయణ, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, షేక్ నాజర్, దాశరథి, ఆరుద్ర తదితరులు అభ్యుదయ దారులను విస్తృతం చేశారు. వీరిని ఒక్కో పురోగమన మలుపునకు ప్రతీకగా తీసుకొని, విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రం వైతాళికుల చిత్రపటాలను రూపొందించింది. వీటిని ప్రముఖ చిత్రకారులు గిరిధర్ ప్రత్యేక శ్రద్ధాసక్తులతో చిత్రించారు. మొత్తం 32 మంది పురోగమన సంస్కృతీ వైతాళికుల చిత్రపటాలను ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ బాలోత్సవ్ భవనం ప్రాంగణంలో శాశ్వత ప్రతిపాదికన అమర్చి, ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో సామాజిక, సాహిత్య విశ్లేషకులు తెలకపల్లి రవి, కథా నవలా రచయిత డా.కెఎన్ మల్లీశ్వరి, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు (క్రియ), బాలాంత్రపు ప్రసూన, అనిల్ డ్యానీ, సత్యాజీ, ఎస్ అనిల్ తదితరులు పాల్గొంటారు.

ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-గన్నవరం : ఆయిల్ పామ్ సాగు చాలా లాభదాయకమని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గన్నవరం ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్లో శుక్రవారం గ్రామస్థాయి ఉద్యాన, వ్యవసాయ సహాయ సిబ్బందికి ఆయిల్ ఫామ్ సాగు పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రారంభం నుండి ప్రభుత్వ ప్రోత్సాహ కాలు లభిస్తాయని, ఈ సమాచారం రైతు లందరికీ తెలియజేయాలని సూచించారు. జిల్లాలో రైతులు ప్రధానంగా వరి పంట ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేస్తుంటారని అన్నారు. ఎంతో లాభదాయకమైన ఆయిల్ ఫామ్ సాగు చేపట్టి ప్రభుత్వ ప్రోత్సాహకాల లబ్ధి పొందేల రైతులను ప్రోత్సహించాలన్నారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ అనే కేంద్ర పథకం క్రింద ఆయిల్ పామ్ అభివద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగు ప్రోత్సహించి రైతులకు అధిక ఆదాయం సమకూర్చడం లక్ష్యం అన్నారు. తద్వారా జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట విస్తీర్ణం పెంపు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ఈ పంట సాగు చేసి నాలుగు ఏళ్ళు కాపాడితే తర్వాత 50 సంవత్సరాలు ఆదాయం వస్తుందన్నారు. ముఖ్యంగా సూక్ష్మ సేద్య పద్ధతిలో ఆయిల్ ఫామ్ సాగు మరింత లాభదాయకం కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. జ్యోతి, జిల్లా సూక్ష్మ సేద్య పథక సంచాలకులు విజయలక్ష్మి, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, పతంజలి కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న బుద్ధ ప్రసాద్, దాతలు

దాతల సాయం అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : పేద విద్యార్థులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్న దాతలు ఆదర్శనీయులని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం నాగాయలంక మండల పరిధిలోని భావదేవ రపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన చందు రాములు కనకమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చందు సుబ్బారావు సత్యనారాయణ మూడు కంప్యూటర్లను బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా బహుకరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించి వారికి సాంకేతిక విద్య అభివద్ధికి తమ వంతు ప్రోత్సాహం అందించాలని అన్నారు. గ్రామంలో 12 లక్షలు చెల్లించి స్మశాన వాటిక అభివద్ధికి చందు సుబ్బారావు చందు సత్యనారాయణ చేసిన కషి ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కంప్యూటర్ విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు ఉన్నత సాంకేతిక విద్య అవకాశాల ద్వారా ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఇప్పటినుంచే మార్గాలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు టీవీఎం రామదాసు, రామారావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, హెచ్ఎం జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వైసీపీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ప్రజా సంఘాలపై చేసిన దూషణలను నిరసిస్తూ మచిలీపట్నంలో కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన తెలియజేశారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట జర్నలిస్టులు చేసిన నిరసనకు వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. మీడియాపై దూషణలకు పాల్పడిన విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ నుండి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లిన జర్నలిస్టులు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అబ్దుల్ మతీన్, ఏఐటీయుసీ జిల్లా నాయకులు లింగం ఫిలిప్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (చంటి), జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

ట్రై సైకిల్ వితరణ



వికలాంగుడు ఏసేబుకు ట్రైసైకిల్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు.

ప్రజాశక్తి-పెడన : పెడనలోని 11వ వార్డు చెందిన వికలాంగుడు గూడూరు ఏసేబుకు సహాయ పౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్‌ను ఉచితంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్ భాష మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడంలో తమ ఫౌండేషన్ ఎప్పుడు ముందంజలోనే ఉంటుం దన్నారు. గత కొంతకాలం క్రితం ప్రమాదవశాత్తు ఏసేబుకు కాలు కోల్పోయాడని, అతని జీవనోపాధి అయిన చెప్పులు కుట్టే వత్తి కూడా తను చేసుకోలేని పరిస్థితుల్లో ఉండడాన్ని ఫౌండేషన్ సభ్యులు తన దష్టికి తీసుకు వచ్చారన్నారు. దీనిపై స్పందించిన సహాయ ఫౌండేషన్ సభ్యుడు తాత సాయిరాం సహ కారంతో ఈ ట్రై సైకిల్ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగ కమిటీ చైర్మన్ మట్ట రాధా కష్ణమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, బట్ట దుర్గా శంకర్, విగ్నేశ్వర రావు, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వారంలో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి డెంగ్యూ, మలేరియాలను నివారణకు ప్రజలు సహకరించాలని చిలకలపూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వి.శ్రావ్య సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి వైద్యురాలు శ్రావ్య ఆధ్వర్యంలో శుక్రవారం చిలకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇంటి ఇంటి కి తిరిగి ప్రజలకు డ్రై డేపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వారి ఇంటిలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసు కోవాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్లాస్టిక్ బాటిళ్ల ,టైర్లు ,వధాగా పారవేసిన ప్లాస్టిక్ బాటిల్లు , టైర్లు ,వధాగా పారవేసిన ప్లాస్టిక్ కుండీలు ,ఇతర గహపకరణాలను శుభ్రము చేసుకోవాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.మురళి, జిల్లా ఆరోగ్య విద్య, విస్తరణాధికారి బి. శివసాంబి రెడ్డి, ఏ . నాగమణి ఏఎన్ ఎం, కే బాలాజీ ,సిహెచ్ ప్రవీణ్ కుమార్ ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి చల్లపల్లి** : ప్రతి ఒక్కరూ తాము నివసిస్తున్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి పి.సువర్ణరాజు సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం చల్లపల్లి సచివాలయం - 4 పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా నీటినిల్వలు లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్లోరినేషన్ చేసిన తాగునీరు, కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటి ఫీవర్ సర్వేచేసి దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మురుగుగుంటల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పివి.మాధ వేంద్రరావు, ఎంపీహెచ్ఎస్ ఎన్.కమలాకరరావు, ఎంపీహెచ్ఎలు పి.రాజబాబు, ఎ.జసంతి తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో...



చల్లపల్లిలో...

గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులు అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామంలో గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ కెవిఎస్‌వి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో దావాజీగూడెంలో దాడి చేశామని తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ వద్ద పోలీసులను చూసి పారిపోతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, ఆ నలుగురు వ్యక్తులను విచారించగా వారిలో ఒకడైన నక్కిన దుర్గా తిరు వెంకటేష్ అను వ్యక్తి పై ఇప్పటికే రెండు గంజాయి కేసుల్లో ముద్దాయి అయినట్లు గుర్తించినట్లు చెప్పారు. అతనికి పరిచయం ఉన్న చిన్న నాగరాజు, చీరాలకు చెందిన రవి తో కలిసి ఒరిస్సా బోర్డర్ వద్ద మల్కాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద సుమారుగా 12 కేజీలు గంజాయిని కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అందులో 9 కేజీలు గంజాయిని చీరాల చెందిన రవి తీసుకొని వెళ్లగా మిగిలిన మూడు కేజీలు తీసుకొని నాగరాజుతో కలిసి గన్నవరం వచ్చి గత పది రోజుల నుండి చిన్న చిన్న ప్యాకెట్లుగా జ్యూస్ కవర్లలో పెట్టి గన్నవరం, దావాజీగూడెం, విజయవాడ పరిసర ప్రాంతాల్లో తమకు పరిచయం ఉన్న తమ స్నేహితుల ద్వారా అమ్మకాలు జరిపగా వచ్చిన డబ్బులను జలసాలకు వినియోగించుకున్నట్లు వెంకటేష్ చెప్పాడని తెలిపారు. వారి వద్ద ఉన్న గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో చేసుకొని అమ్ముదాం అనే ఉద్దేశంతో దావాజీగూడెం హై స్కూల్ సమీపంలోకి రాగా పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1.86 కేజీల గంజాయిని, ఖాళీ జ్యూస్ ప్యాకెట్ కవర్లను స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాన్ని పాడు చేసుకోవద్దని, ఎవరైనా నిషేధిత గంజాయిని కలిగి ఉన్నట్లయితే, సేవించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీ సీట్లు కూడా తెరుస్తామని హెచ్చరించారు. గన్నవరం పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి అమ్మితే విషయాన్ని గన్నవరం పోలీసువారికి తెలియజేయాలని కోరారు. ఎస్సై శివప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : గత సంవత్సరం మీచౌంగ్ తుఫాన్ నష్టపరిహారం, ఇన్పుట్ సబ్సిడీ రైతులకు ఇవ్వాలని, పంటల బీమా పరిహారం ఇవ్వాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన రైతు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు రైతులకు ,కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని కోరుతూ మండలంలో బంటుమిల్లి గ్రామ-2 సచివాల యంలో, పెందుర్రు, ములపర్రు, నాగేశ్వరరావు పేట ఆముదాలపల్లి, అర్తమూరుగ్రామ సచివాలయాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ శక్తి సంబంధించి ఇచ్చిన 22వ జీవోను, స్మార్ట్ మీటర్లలను రద్దు చేయాలని, కౌలు రైతులకు భూయా జమాని సంతకంతో ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి ,బ్యాంకు పంట రుణాలతో పాటు, ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు కూడా ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకం 100 రోజుల నుంచి 200 రోజు వరకు పెంచాలని, 600 రూపాయల వరకు రోజు కూలి ఇవ్వాలని ,ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండలం రైతు సంఘ అధ్యక్ష ,కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన రావు, రైతులు వెంట్ర పాటి శ్యామసుందర్, గొట్టిపాటి గంగాధర్, సుంకర వెంకన్న, చిటికినేని నాగమల్లి, చిటికినేని బలరాముడు, సుంకర నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

చిట్టినగర్లో శాకాంబరీ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక చిట్టినగర్‌లోని శ్రీ నగరాల సీతారామ స్వామి శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానంలో శాకాంబరి దేవి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 21వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ ఉత్సవాలకు కూరగాయలు సమర్పించిన దాతలు రాజగిరి శివ, వారి కుటుంబాన్ని సత్కరించారు.



కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు : సుజన

ప్రజాశక్తి-వన్‌టౌన్: గత మూడు రోజులుగా కురుస్తున్న నానుడు వర్షాలకు కొండ ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 51వ డివిజన్ కొండ ప్రాంతంలో ఉన్న ఇంటి దగ్గర ఉన్న పిచ్చింగ్ జారి కింద పడింది.కడవల అప్పారావు (పువ్వుల అప్పారావు) ప్రాంతంలోని బాధితుల ఇంటి వద్ద చోటు చేసుకున్న పరిణామాలను స్థానిక టిడిపి నాయకులు సుకాశి కిరణ్ కుమార్ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం 51వ డివిజన్‌లోని ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, జోనల్ కమిషనర్ కీర్తన పర్యటించి నేరుగా ఈ సమస్యతో పాటు బాధితులను పలకరించి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతంలో నివసిస్తున్న కడవల నూకాలమ్మ, రాజు కుటుంబ సభ్యులకు సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఆర్థిక సాయం అందజేశారు. కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఈ ప్రాంత సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న గవర్నర్ సతీమణి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర గవర్నర్ సతీమణి సమీరా నజీర్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు ఆధ్వర్యంలో శుక్రవారం చిలకల్లు ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీ భార్గవి, సూపర్వైజర్ కే ఉషారాణి ఆదేశాల మేరకు పెనుగంచిప్రోలు 6 నుండి 12 అంగన్వాడీ కేంద్రాల్లో సామాజిక వేడుకలు నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పాలకమండలి సమావేశం శుక్రవారం చైర్మన్ ఛాంబర్ నందు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ కె రమేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. పాలక మండలి సమావేశంలో ఆలయ అభివృద్ధి, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరావు, ఈఈ వైకుంఠ రావు, ఎఇ రాజు, పలువురు అధికారులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



సైబర్ నేరాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నందిగామ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఏసిపి రవి కిరణ్ పేర్కొన్నారు. నందిగామ ఏసిపి బి.రవికిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ ఆర్ఎస్ గార్డెన్‌లో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా ఏసిపి రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు మోసపూరిత ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ హనీష్, ఎస్ఐలు పండు దొర, దుర్గమహేశ్వరావు, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ సుందర్ పాల్గొన్నారు.

ముసురుతో జనజీవనం అస్తవ్యస్తం

• లోతట్టు ప్రాంతాలు జలమయం • మెట్ట పంటలకు నష్టం

ప్రజాశక్తి-కంచికచర్ల

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఈ నెల 17 బుధవారం రాత్రి నుండి 19న శుక్రవారం రాత్రి వరకు ముసురు పట్టి జల్లులు పడుతూనే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో కంచికచర్లలో 25.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నందిగామలో 22.8, చందర్లపాడులో 28.2, వీరులపాడులో 23.0, జగ్గయ్యపేటలో 14.8, వత్సవాయిలో 15.2, పెనుగంచిప్రోలులో 18.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి గ్రామాల్లో అంతర్గత రహదారులపై నీరు నిల్వ చేరి తటాకంగా మారాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నందిగామ ప్రాంతంలో మెట్ట పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 35 వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. మొక్కలు పెరుగుతున్నాయి. ముసురు వల్ల పత్తి పొలాల్లో కలుపు మొక్కలు పెరిగాయి. పొలాల్లో కలుపు నివారణకు అరకలతో పైపాటు చేసే అవకాశం లేకుండా పోయింది.కలుపు పెరగటం వల్ల రాబోయే కాలంలో కలుపు తీయించడానికి అదనపు పెట్టుబడి అవుతుందని రైతులు అంటున్నారు. అలాగే తొలకరి సాగు చేసిన పెసర, మొక్కజొన్న తదితర పంటలు కూడా కలుపు దట్టంగా పెరిగిందని రైతులు అంటున్నారు.

మురుగునీటితో సహవాసం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాజులపేట వద్ద గత కొన్ని రోజుల కురుస్తున్న వర్షానికి డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగునీరు రోడ్డుపైన నిలువ ఉంటుందని, దీంతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు నిత్యం డ్రైనేజీ మురుగుతో సహవాసం చేయాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సరఫరా చేసే పైప్ లైన్ మురుగునీటిలోనే ఉండటం, దానికి లీకులు ఉండటంతో అతిసార లాంటి రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని, మంచినీటి పైప్‌లైన్ రిపేరు చేసి, రోడ్డుపై డ్రైనేజీ రాకుండా కనీసం తాత్కాలిక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొండపల్లి ప్రధాన రహదారి సైతం కొద్దిపాటి వర్షానికి సైతం డ్రైన్‌లు నిండిపోయి మురుగు రోడ్లపై చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

పెసర రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-వత్సవాయి: మెట్ట పంటలైన పెసర, మినుము, మొక్కజొన్న, పత్తి పొలాల్లో కలుపు మొక్కలు పెరిగాయి. పత్తి పొలాల్లో నీరు నిలబడి ఉండటంతో వేరుకుల్లుడు వచ్చే అవకాశం ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఇంతటితో తగ్గితే పంటల ఆశాజనకంగా ఉంటాయని రైతుల అంటున్నారు. ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తి పొలాల్లో కలుపు విపరీతంగా పెరిగిపోయిందని రైతుల అంటున్నారు. ఈ వర్షాలకు పంటలకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పోలంపల్లి మున్నేరు కాలువకు నీరు వదలడంతో పుష్కలంగా ప్రవహిస్తుంది. బావుల్లోకి నీరు రావడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



పెసర చేలో పెరిగిన కలుపు మొక్కలు



కొండ ప్రాంత వాసుల్లో ఆందోళన

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంత వాసులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. 51వ డివిజన్‌లో శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కొత్తపేట రాజగిరి వారి వీధి, కడవల అప్పారావు (పువ్వుల అప్పారావు) కొండ ప్రాంతంలో ఉన్న ఇల్లు పిచ్చింగ్ జారిపోయింది. అందులో నివాసం ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండటంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికుల సమాచారం మేరకు కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే సంబంధించిన అధికారులను పిలిపించి సమస్య తెలియజేశారు. ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్‌తో మాట్లాడి మెట్ల మార్గానికి అడ్డుగా ఉన్న మట్టిని, రాళ్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టి స్థానికులకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు ఎమ్మార్వోతో ఫోన్‌లో మాట్లాడినట్లు కార్పొరేటర్ తెలిపారు. నిరాశ్రయులైన వారి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఎఇ రామకష్ణ, సచివాలయం సెక్రటరీలు, శానిటేషన్ విభాగం అధికారులు వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చూడాలని కార్పొరేటర్ రాజేష్ కోరారు. సంఘటనా స్థలాన్ని సిపిఎం నాయకులు కె.సూరిబాబు సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విఎంసి అధికారులు వెంటనే స్పందించి రాకపోకలు సాగించే విధంగా కూలిపోయిన మట్టి దిబ్బను తొలగించాలని కోరారు. కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూరిబాబు సూచించారు.

ముగిసిన నాగులు అంత్యక్రియలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రామ్‌కో ఫ్యాక్టరీలో గురువారం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు నాగులు మృతదేహానికి శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్లో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు. స్వగ్రామం జయంతిపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ సోదరులు టిడిపి నాయకులు శ్రీరామ్ ధనుంజయ చినబాబు, వైసిపి నాయకులు సామినేని వెంకటప్రసాద్ బాబు నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, మండల నాయకులు వి.రాంప్రసాద్, కోట కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గోపినాయక్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి : సిఐటియు

రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం సిఐటియు నాయకులు తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎం. సోమేశ్వరరావు, మండల నాయకులు రాంప్రసాద్, కోట కృష్ణ మాట్లాడుతూ జగ్గయ్యపేట మండల పరిధిలో ఉన్నా వివిధ ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత, కార్మిక చట్టాలు అమలు చేయడంలేదన్నారు. తరచూ ఘటనలు జరుగుతుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఫ్యాక్టరీలో కార్మికులకు కనీస భద్రత కల్పించాలని, ప్రమాదాలు నివారించాలని అధికారులను కోరారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ముగిసిన బి2బి సమావేశాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్), , ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య మద్దతుతో యూఏఈ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించేలా బి2బి సమావేశాలు విజయవంతంగా నిర్వహించినట్లు కౌన్సిల్ ఛైర్మన్ రవి కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు నోవాటెల్ వరుణ్‌లో ఈ నెల 17 నుండి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరిగాన్నారు. యూఏఈలోని షార్జా ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ అందించే లాభదాయకమైన అవకాశాలను అన్వేషించాలనే ఆసక్తి కలిగిన, 70 కంటే ఎక్కువ కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనటం ద్వారా అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు.



జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-వత్సవాయి: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28వ తేదీ వరకు చేపడుతున్నట్లు అధ్యక్షులు రేగండ్ల వెంకటరామయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వత్సవాయి మండలంలో 25 గ్రామపంచాయతీలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు తీసుకోవచ్చని తెలిపారు.

గుంతలమయంగా రోడ్డు

ప్రజాశక్తి-వత్సవాయి: మండలంలోని మక్కపేట-భీమవరం గ్రామాల రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ రహదారి నిర్మించి పట్టుమని సంవత్సరం కూడా కాక ముందే గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మక్కపేట నుండి హైవే వరకు రహదారిపై వర్షపు నీరు నిలబడి గుంతలమయంగా మారింది. వాహనదారులు లోతు తెలియక అయోమయానికి గురై పడిపోతున్నారు. ఈ రహదారి గుండా ఖమ్మం, బోనకల్, వైరా వత్సవాయి తదితర ప్రాంతాల ప్రజలు విజయవాడ వెళ్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చినుకు పడితే.. కునుకు ఉండదు..



ఇళ్ళ మధ్యలో మురుగు



ప్రజాశక్తి-గన్నవరం

చినుకు పడితే కునుకు ఉండదు.. ఎటు చూసినా వర్షం నీరే కనిపిస్తుంది.. మురుగులో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇది వర్షా కాలంలో వెంకటనరసింహ పురం కాలనీ పరిస్థితి.

21 ఏళ్ల క్రితం ప్రభుత్వం గన్నవరం మండలం వెంకటనరసింహాపురంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. లబ్ధిదారుల్లో కొందరు కుటుంబ పరిస్థితుల రీత్యా స్థలాలు వేరొకరికి అమ్ముకున్నారు. అందరూ కష్టపడి సొంతిళ్లు కట్టుకున్నారు. గన్నవరం పట్టణానికి కూ తవేటు దూరంలో ఉండటంతో సొంతింటితో నిలువ నీడ దొరికిందని వారంతా సంబరపడ్డారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించ కపోయినా అద్దెల దరువునుంచి తప్పించుకునేందుకు పేదలు చాలా మంది వాటిల్లో ఉంటున్నారు. స్థలాలు ఇచ్చాం.. మీ తిప్పలు మీరు పడడని ప్రభుత్వం వదిలేసింది. దీంతో నివాశితులకు కష్టాలు మొదలయ్యాయి. చినుకు పడితే రోడ్లన్నీ నీటితో మునిగిపోతున్నాయి. ఇళ్ల పరిస్థితి అదేలా తయారైంది. మురుగు నీరంతా ఖాళీ స్థలాల్లోకి చేరి దోమలకు కేంద్రాలుగా మారాయి. మట్టి రోడ్లు బురదగా మారి జనాలకు ఇబ్బందులు పంచుతున్నాయి. మంచినీరు తాగడానికి లేక టిన్నులతో కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల పంచాయతీ సర్పంచ్, అధికారులు కలిసి కొన్ని గ్రావెల్ రోడ్లు వేశారు. మిగిలిన అంతర్గత రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

• వెంకటనరసింహాపురం కాలనీ ప్రజల ఆవేదన

పల్లపు ప్రాంతా ల్లో ఉంటున్న వారు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎక్కడా డ్రెయినేజీ లేదు. ఇళ్లలో వాడిన మురుగంతా రోడ్లపైకే వస్తుంది. దీ ంతో వందలు స్వైర విహారం చేసి నాశనం చేస్తున్నాయి. రాత్రైతే దోమలు ఇళ్లలోకి వస్తున్నాయి. విషజర్వాలు పంచుతున్నాయి. పం చాయతీలోనిధులు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. నీటి సరఫరా చేసి సరిపెడుతున్నారు. గుర్తొచ్చినపుడు వీధి లైట్లు వేస్తు న్నారనే వాదనుంది. మూడు వేల కుంటుంబాలు రోజూ అవస్థలు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోజూ నానా కష్టాలు పడుతున్నాం: శివాజీ

ఇళ్ల మధ్యలో మురుగు ఉండటంతో దోమలు వద్ది చెంది నిద్ర లేకుండా చేస్తున్నాయి. జ్వరాలు ప్రబలడంతో ఇంటికో వ్యక్తి ఇబ్బంది పడుతున్నారు. మట్టి రోడ్లు చితడిగా మారి జనాలను కష్టాలకు గురి చేస్తున్నాయి.

మా బాధలు ఎవ్వరికీ పట్టవా..? అప్పారావు

మౌళిక సదుపాయాలు లేకపోవడంతో జనాలు పడుతున్న బాధలు ఎవ్వరికీ పట్టం లేదు. వర్షం పడిందంటే కష్టాలు మొదలవుతాయి. రాత్రిళ్లు పాములు సంచారం అధికారంగా ఉంటుంది. పారిశుద్ధ్య పనులు చేయించే అధికారి లేరు. ఆర్వో ప్లాంటు పెట్టేందుకు ముందుకు రావడం లేదు.



మోటివేటర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పరచుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జూనియర్ కళాశాలలో కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్ ఎల్ అండ్ డి ట్రైనర్ శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు వారు సాధించాల్సిన లక్ష్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యం ఏర్పరచుకొని దాని లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాల సాధన కోసం కలలు కనాలని ఆ కలలను సార్ధకం చేసుకునేందుకు పట్టుదల శ్రమ అవసరమన్నారు. అప్పుడే ఉన్న త శిఖరాలను అధిరోహించగలుగుతామన్నారు. లక్ష్యంతో కషి చేస్తే విజయం వరిస్తుందని, ఆ విజయాలతో మంచి భవిష్యత్తును పొందవచ్చు అన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని శ్రీనివాసరావు కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ పి రేఖ రాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు, కళాశాల పాత్రికేయులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

కాల్వల్లో గుర్రపుడెక్కతో ఇబ్బందులు

ప్రజాశక్తి-మొవ్వ : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు కాలువలు నిండు కుండలా ప్రవహి స్తున్నాయి. భీమనది కాలువలో గుర్రపు డెక్క, నాచువ్యర్థాలతో నిండిపోయి ఉండడం నీళ్ల సక్రమంగా వెళ్లడంలేదని పలువురు రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో ఉన్న నాచు, గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చెరువులకు జలకళ

ప్రజాశక్తి - గన్నవరం : మండలంలోని మెట్ట గ్రామాల్లో సాగు నీటి చెరువులు ఎరుపు రంగు పూసుకున్నాయి. వాగులు డొంకల ద్వారా వర్షం నీరు చెరువులకు రావటంతో ఎర్రటి రంగు పూసుకున్నాయి. బిబిగూడెంలో మూడు చెరువులు నీటితో నిండాయి. రైతులు వరి నాట్లు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం పొలాల్లో నాట్లు వేశారు. మరో 50 శాతం పొలాల్లో నాట్లు వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. పురుషోత్తపట్నంలోని మూడు చెరువులకు నీరు చేరుతోంది. మరో పది రోజుల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండుతాయి. ఈ మూడు చెరువులు నిండితే 2 వేల ఎకరాల్లోవరి సాగవుతోందని రైతులు చెప్పారు. చిక్కవరం, కొత్తగూడెం, తెంపల్లి చెరువులకు నీరు చేరుతోంది. చెరువులు నీటితో నిండుతుంటే చూసి రైతులు ఆనందిస్తున్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి మొక్క అందిస్తున్న ఎస్పి

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పి

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు శుక్రవారం న్యాయమూర్తి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులను తగ్గించడానికి , లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయశాఖ, పోలీసు శాఖలు సమన్వ యంతో పనిచేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయటంపై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరపున కషి చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-కోడూరు : గాలిని శుద్ధి చేసే శక్తి మొక్కలకే ఉందని మొక్కలు పర్యావరణానికి మేలు చేస్తాయని స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలా వెంకటరమణ అన్నారు. ఉపాధ్యాయులు నాగభూషణం చేపట్టిన రోజుకు ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని శుక్రవారం జరుగువానిపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మొక్కలు నాటించారు. 100 రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా సాయిపురం రహదారి

ప్రజాశక్తి-ఉయ్యూరు : సాయిపురం రోడ్డు గుంతల మయంగా తయారై ద్విచక్రవాహనాలు సైతం నడిపేందు కు వీలు లేక గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రానికి దూరంగా విసిరివేసినట్టు పొలాల మధ్యదూరంగా ఉండే సాయిపురం చారిత్రాత్మకంగా ఎంతో వి శిష్టత కలిగిఉంది. గతంలో అగ్రహారంగా, పలువురు ప్రముఖులకు జన్మస్థలమైన ఈ గ్రామానికి వెళ్లేందుకు విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి నుండి పమిడిము క్కల మండలం గోపువాని పాలెం, మద్రివాడ మీదుగా వెళ్లే రోడ్డు సాయిపురం పరిధిలో పూర్తిగా గుంతలమయంగా తయారైంది. అదేవిధంగా ఉయ్యూరు నుంచి ఎగినపాడు మీదుగా గ్రామానికి వచ్చే రోడ్డు పొడవునా గుంతలతో నిండిపో యింది. ముదునూరు నుంచి సాయిపుం వచ్చేరోడ్డులో చంద్రయ్యకోడు మీద వంతెన కూలిపోయే స్థితిలో ఉండగా వంతెనపై నుంచి బిక్కు బిక్కు మని వెళ్లవలసి వస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



పట్టించుకున్నవారు లేరు : ఎస్. జానాబాషు, సర్పంచ్


గ్రామానికి వచ్చే రోడ్డు గుంతల మయంగా ఉండి ద్విచక్రవాహనాలు సైతం వెళ్లేందుకు వీలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు బాగు చేయాలని అ దికారులు, ప్రజాప్రతినిధులకు సంవత్సరాల తరబడి వినతి పత్రాలు అందజేస్తున్నా పట్టించుకున్న వారు లేరు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : భారత వాయుసేనలో అగ్నివీర్ పథకంలో భాగంగా ఉద్యోగాల నియామకం కోసం భారత వాయు సేన నోటిఫికేషన్ విడుదల చేసిందని కృష్ణ జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు యువత మక్కువ చూపాలని సూచించారు. రాబోయే కాలంలో భారత దేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకటిగా మార్చాలంటి యువత కీలకం అన్నారు. అగ్నివీర్ ఉద్యోగాలకు 2004 జులై నుండి 2008 జనవరి మధ్య జన్మించిన స్త్రీ / పురుష అభ్యర్థులు అర్హులు ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్, సబ్జెక్ట్ లో, ఇంటర్మీడియట్ లో ఒకేషనల్ లేదా పాలిటెక్నిక్ లలో కనీసం 50 శాతం మార్కులతో పాస్ ఐనవారు https://a gnipathvayu. cdac.in వెబ్ సైట్ లో ఈ నెల 8వ తేదీ నుంచి 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ పరీక్షా అక్టోబర్ 10వ తేదీ నుండి నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ఈ ఉద్యోగాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు శాకంబరీ అలంకారంలో దర్శనం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామములోని శ్రీ కొండలమ్మ అమ్మవారు ఈనెల 21వ తేదీ ఆదివారం ఉదయం శాకంబరి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి వివిధ రకముల కూరగాయలతో, పండ్లతో శాకాంబరి అలంకారం దర్శనం, తదనంతరము నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వినియోగం జరుగుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో యాత్రికులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.




బిబిగూడెంలో నిండిన చెరువు

రోగులకు మెరుగైన వైద్యం : నాయక్



ప్రజాశక్తి-తిరువూరు: వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నందున విధి నిర్వహణలో సమయ పాలన పాటించి రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని జిల్లా కమ్యూనిటీ హెల్త్ అధికారి బిసికె నాయక్ వైద్యాలకు, హెల్త్ అసిస్టెన్సుకు, సిబ్బందికి సూచించారు ఆదేశించారు. తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రి ని శుక్రవారం ఆయన సందర్శించి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రతి డాక్టర్, సిబ్బం ది టైం కు విధుల్లోకి వచ్చి మళ్లీ టైం ప్రకారం వెళ్లాలని, డ్యూటీలో ఉండి బయటకెళ్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసరమయితే సూపరిండెంట్ అనుమతి తీసుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అత్యవసర యూనిట్‌ను తప్పని సరిగా ఉపయోగించాలని అయన వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ గారిగేయి పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతి



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, విజయవాడ పట్టణంలో స్వచ్ఛభారత్ ఎండి గంధం చంద్రుడుని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి తమ వంతు కృషి చేస్తున్నామని, కాంపాక్టర్ బిన్లు రిపేరు, కొత్తవి ఏర్పాటు చేయడానికి మరియు జగ్గయ్యపేట పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ సహకారంతో స్వచ్ఛ భారత్ ఎండి ని కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే అడ్వర్స్ సీజనల్ గ్రాంట్ ద్వారా వాటర్ హెడ్ వర్క్స్ వద్ద నూతన మోటార్లు కొనుగోలు చేయడానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నందిగామ రోడ్డు అధ్వానం



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణం జయ సిద్ధార్థ హై స్కూల్ దగ్గర నడిచే పరిస్థితి లేకుండా గుంతలు పడి వర్షపు నీరు నిల్వ ఉండడం వలన విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రాకపోకలతో ఉండే ఈ రోడ్డు దుస్థితి దారుణంగా తయారైంది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గుంతలు ఎక్కువ అవ్వడం వల్ల స్కూల్ కెళ్లే పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు వైపు వెళ్లే పరిస్థితి లేకుండా పెద్ద గుంతలు ఏర్పడి బురదమయం అయ్యి పిల్లలు జారి పడుతున్నారు. నిరంతరం కురుస్తున్న వానకు గుంటల మయం అయినాయి. దీన్ని సంబంధిత అధికారులు ఈ రోడ్డు మరమ్మత్తులు చేయాలని వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

వైసిపి దోచుకున్న డబ్బును పంచాలి : బుద్ధా

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజల వద్ద దోచుకున్న డబ్బులను వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు పంచి క్షమాపణ చెప్పాలని ఉత్తరాంధ్ర టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పుంగునూరులో తండ్రి కొడుకులపై దాడి చేసింది స్థానిక ప్రజలే తప్ప టిడిపి కార్యకర్తలు కాదన్నారు. గతంలో పెద్దిరెడ్డి గనులు శాఖ మంత్రిగా న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసేవారి వద్ద నుండి దౌర్జన్యంగా వారి వ్యాపారాలను లాక్కున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో పెద్దిరెడ్డి సొంత ఊరైన పుంగనూరులో కిరాయి రౌడీలు చేత బాబుపై దాడి చేయించారని ఆరోపించారు. ప్రస్తుతం బాబు రామరాజ్యపాలన చేస్తుండగా, గతంలో జగన్ రాక్షస పాలన సాగించారన్నారు. పెద్దిరెడ్డి బాధితులు ఎవరైనా ఉంటే వారికి న్యాయం చేసి వారి ఆస్తులను తిరిగి అప్పగిస్తామన్నారు. ఈ సమావేశంలో కొట్టేటి హనుమంతరావు, ఉమ్మడి చంటి, తుపాకుల వెంకటేశ్వర్లు, శివాజీ ముదిరాజ్, పేరం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు!



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో ఇసుక జోరుగా అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. రాత్రి అయితే చాలు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇసుక డిమాండ్ పెరగడంతో హైదరాబాద్ కు ఖమ్మం మీదుగా రాత్రికి 10 లారీలకు లోడ్ చేసుకొని ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తరలింపు పై పెద్దల హస్తం ఉందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను కూడా ఇసుక బకాసురులు పాటించటం లేదు.తెర వెనక ఉన్న సూత్రధారులు ఎవరూ పాత్రధారులు ఎవరు . ఇసుక లోడింగ్ లో కూడా చేతివాటం చూపిస్తున్న వైనం నెలకొంది. అదనపు డబ్బులు చెల్లిస్తే ఎక్కువ లోడు చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఇసుక బకాసులకి అడ్డుకట్ట వేయకపోతే ఇసుక బకాసురులు బలితెగించే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలు అంటున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు 176 సచివాలయం పరిధిలో దోమల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రం పంపిణీ చేస్తూ వివిధ ప్రాంతాల్లో ఉన్న లార్వాను గుర్తించి ప్రజలను చైతన్యవంతులు చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, మలేరియ ఇన్స్పెక్టర్ ఎస్.కె రాంబాబు, డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. రవిశంకర్ పాల్గొన్నారు. 44వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి దుర్గారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సతీష్, శానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమావేశ మందిరంలో కొండపల్లి మునిసిపల్ కమీషనర్ వై.శంకర్‌నాయక్ అధ్యక్షతన ఎఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పద్మావతి మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కొండపల్లి ఖిల్లా రోడ్డు పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. **కంచికచర్ల:** వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయితీ విస్తరణాధికారి బి.శ్రీనివాసరావు ప్రజలకు అవగాహన కల్పించారు. గొట్టుముక్కల, గండేపల్లి, కీసర గ్రామాలలో పర్యటించారు. **నందిగామ:** నందిగామ మునిసిపల్ కమిషనర్ కె.హేమమాలిని ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ పరిసరాలు, డ్రెయిన్లలో చెత్త చెదారం, ప్లాస్టిక్ వేయరాదని కోరారు.



కొండపల్లిలో అవగాహనా ర్యాలీ



50వ డివిజన్‌లో...

జగ్గయ్యపేట: మున్సిపల్ చైర్మన్ నాగమల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. **గంపలగూడెం:** ప్రస్తుత వర్షాకాల పరిస్థితుల్లో దోమకాటతో అనేక ఇబ్బందులు ఉంటాయని గంపలగూడెం గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ పేర్కొన్నారు. దోమల నివారించేందుకు ప్రత్యేకంగా వారంలో ఒకరోజు ఏర్పాటు చేస్తూ ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. గృహాల పరిధిలో ఎటువంటి పాత్రలోనూ నీరు నిల్వ ఉంచరాదని అవగాహన కల్పించారు.

రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలు : సందీప్

ప్రజాశక్తి-వన్‌టౌన్: రక్షణ రంగంలో విస్తత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎన్ సందిప్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో రక్షణ రంగంలో ఉపాధి అవకాశాలు అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సందిప్ మాట్లాడుతూ త్రివిధ దళాల్లో పని చేసేందుకు వివిధ క్యాడర్లలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒకవైపు ఉపాధితో పాటుగా దేశానికి సేవచేసే అవకాశాలను పొందవచ్చన్నారు. ఆ క్రమంలో ఇటీవల అగ్నివీర్‌తల్ (ఆర్మీ), అగ్నివీర్‌జల్ (నేవీ), అగ్నివీర్‌వాయు (ఎయిర్‌ఫోర్స్) విభాగాల పేరుతో ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధితో పాటుగా



దేశానికి సేవచేసే అవకాశం ఈ త్రివిధ దళాల ద్వారా పొందవచ్చన్నారు. వాటిపై విద్యార్థుల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ అర్హతలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెలగా జోషి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కేపీటీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులు త్వరగా చేపట్టాలి : కొలికపూడి



ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో నిలిచిపోయిన హైవే రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని నేషనల్ హైవే అధికారులతో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన రామచంద్రాపురంలో రోడ్డు నిర్మాణం చెయ్యకపోవడం వల్ల గోతులమయంగా మారి ప్రయాణికులు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నేషనల్ హైవే అధికారులతో రోడ్డు నిర్మాణం ఎందువల్ల ఆగిందని కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణం చేయకుండా రామచంద్రపురం గ్రామానికి చెందిన పలువురు కోర్టులో వేశారని అందువల్లే రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయని అధికారులు ఎమ్మెల్యేకి అధికారులు వివరించారు. దీంతో ఆయన కోర్టులో వేసిన వారితో సంప్రదింపులు జరిపి వారికి కూడా న్యాయం జరిగేలా చూసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా తగు చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే కొలికిపూడి పోలిశెట్టిపాడు గ్రామంలో టిడిపి దిమ్మెను ఆవిష్కరించి అక్కడ జిల్లా పరిషత్ పాఠశాలలో 13 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో సైకిళ్లను అందజేశారు. అలానే కోడూరు గ్రామంలో వికలాంగునికి మూడు చక్రాల ట్రై స్కూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, ఎఎంసీ మాజీ చైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి, వాసం మునియ్య పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో గ్రీన్స్ డే

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం రాఘువాపురం గ్రామ శివారు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో గ్రీన్ డే సెలబ్రేషన్ సందర్భంగా శుక్రవారం మొక్కలు నాటారు. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.ఎస్.రావు, పాఠశాల డైరెక్టర్ సిహెచ్.వి.సూర్య, విద్యార్థులు మొక్కలు నాటారు.

సైన్స్ ఎగ్జిబిషన్లో షాబాజ్ ప్రతిభ

ప్రజాశక్తి-నందిగామ: ఢిల్లీలోని సైన్స్ ఎగ్జిబిషన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన నందిగామ ప్రాంతానికి చెందిన విద్యార్థి సఫాన్ షాబాజ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించడం గర్వించదగ్గ విషయం అని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నారు. శుక్రవారం శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ (సిబిఎస్)లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ షాబాజ్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో (హ్యూజ్ పవర్ సేవింగ్ సిస్టం బై సోలార్) అనే అంశంపై అత్యుత్తమ ప్రతిభా నైపుణ్యం కనబరిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడం నందిగామ ప్రాంతానికి గర్వకారణం అన్నారు. పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న శ్రీవిద్యా యాజమాన్యంకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యా పాఠశాల చైర్మన్ కందుల మల్లికార్జున రావు, ఎఓ మేకల రాము, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలం

- కృష్ణాజిల్లా జెసి గీతాంజలిశర్మ



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైన ప్రాంతమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కోరారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు, రైలు, విమాన రవాణా మార్గాల సౌకర్యాలతో పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాను ఎంపిక చేసుకోదగిన ప్రాంతమని, ఉత్సాహవంతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వీరపనేనిగూడెం, మల్లవల్లి, చల్లపల్లి వంటి ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో పద్ధతిపై అనుమతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు .బ్యాంకుల్లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే రుణాలు మంజూరయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్కు సూచించారు. చేతివత్తుల వారిని ప్రోత్సహించేందుకు 18 రకాల ట్రేడ్లతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద అత్యధికంగా టైలరింగ్, తాపీ మేస్త్రి ట్రేడ్లకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిశీలించాలని ఎంపీడీవోలకు సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సిఆర్డిఏ డిడి కోటేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



శాశ్వత భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని కృష్ణనగర్ అంగన్వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవనం నిర్మించాలని స్థానిక అంగన్వాడీలు ప్రజా దర్బార్లో నారా లోకేష్కు విజ్ఞప్తి చేశారు. అద్దె భవనాలకు అద్దెలు చెల్లించలేక సెంటర్లు నడపడం కష్టంగా ఉందని చెప్పారు. నవులూరుకు చెందిన బేతపూడి కోటేశ్వరరావు తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందజేయాలని ఉండవల్లికి చెందిన మైనర్బాబు కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ అర్జీలను లోకేష్కు అందజేశారు

పెట్టుబడి సాయం అందించాలని వినతి



ప్రజాశక్తి-తాడేపల్లి : ఎన్నికల హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు సత్వరమే అందజేయాలని రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు జిల్లాలోనూ అధికారులకు రైతుల సమస్యలపై శుక్రవారం వినతిపత్రాలు ఇచ్చారు. ఇందులో భాగంగా తాడేపల్లిలోని కృష్ణుని వద్దగల సచివాలయ అడ్మిన్కు అర్జీ అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వెంటనే ఈ సాయం అందించి ఆదుకోవాలని కోరారు. భూయజమానుల సంతకాలతో సంబంధం లేకుండా కౌలురైతుల గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెదవడ్లపూడి హైలెవర్ ఛానల్ పనులు వెంటనే పూర్తి చేసి ఆ ప్రాంత రైతాంగానికి చివరి భూములకు నీరు అందించే విధంగా చూడాలన్నారు. చిర్రావూరులో పశువుల ఆసుపత్రి నిర్మించాలని కోరారు. కొండవీటి వాగు ముంపు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.దశరధరామిరెడ్డి, బి.గోపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన మురుగు



గన్నవరంలో రోడ్డుపై నిలిచిన మురుగు



గన్నవరంలో ఇంట్లోకి నీరు వచ్చిన నీరు

ప్రజాశక్తి-గన్నవరం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో గన్నవరం మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లన్నీ జలమయం కాగా మురుగు ముంచెత్తింది. రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. ఆరు కోట్లు ఉంటేనే డ్రైనేజీ పనులు అవుతాయని అంచనా వేశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు చేపట్టలేదు. శ్రీనగర్ కాలనీ, గౌడపేట, కొత్తపేట, ముస్లింపేట, దళి తవాడ, రాయనగర్ ఏరియాల్లో ఎక్కడా డ్రైనేజీ వ్యవస్థ లేదు. బుద్ధవరం రోడ్డులో చిన్నపాటి వర్షానికే మురుగు అంతా రోడ్డుపైకి వస్తుంది. నీరంతా దుర్వాసన కొడుతుంటే దాంట్లో నుంచి వెళ్లడానికి జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేసరపల్లి, ముస్తాబాద్, సూరంపల్లి, తెంపల్లి, కొత్తగూడెం, బుద్ధవరం, దావాజిగూడెం గ్రామాల్లోనూ పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేదు. వర్షం పడితే చాలుముగురు డ్రైయిన్లు పొంగి రోడ్లపైకి వ స్తున్నాయని నివాశితులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం పంచాయతీల్లో డ్రైయినేజీల అభివద్ధికి నిధులు మ జూరు చేయాలని కోరుతున్నారు.

డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బందులు : ప్రసాదరావు

డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే నీరరతా రోడ్లపైకి వస్తుంది. మురుగునుండి దుర్వాసన రావడంతో పాటు దోమలు వద్ధి చెంది రోగాలు వ్యాపింప జేస్తున్నాయి. మురుగు నీరు పోయే విధంగా డ్రైయినేజీలు ఏర్పాటు చేయాలి.

వర్షం నీరంతా ఇళ్లలోకే వస్తోంది : రోశయ్య

పంచాయతీల్లో నిధులు లేక మురుగు కాల్వలు కట్టడం లేదు. ఇళ్లలోని మురుగు నీరంతా కాల్వల్లో ఆగిపోతోంది. వర్షం పడితే నీరంతా ఇళ్లలోకి వస్తుంది. దోమలు వద్ది చెందడానికి నిలయంగా మారుతున్నాయి. డైయినేజీల్లో పూడికలు తీయించడం లేదు. పారిశుద్ధ కార్మికులున్నా పనులు సాగడం లేదు. ఏన్నాళ్లీ అవస్థలో తెలియడం లేదు.

జనసేన సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక బస్టాండ్ సెంటరులో జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని శాసనసభ్యులు బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గతంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జనసైనికుడు మెండు దొరబాబు సతీమణి మెండు జ్యోతికి తొలి సభ్యత్వాన్ని బుద్ధప్రసాద్ అందించారు. గత ఏడాది సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు పసుపులేటి రవిని బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు చోడగం విమల్ కష్ణ, ప్రధాన కార్యదర్శి తోట మురళీకష్ణ, పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, సీనియర్ నాయకులు బాదర్ల లోలాక్షుడు పాల్గొన్నారు. **ప్రజాశక్తి, గుడ్లవల్లేరు :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుల్లా త్యాగరాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసైనికులు కషివల్లే ఈనాడు అధికారం దక్కిందని అన్నారు.

జిపిఎస్ గెజిట్ నిలుపుదలపై హర్షం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిపిఎస్ చట్టం గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు, కష్ణాజిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ పేపేటి సత్యం,నాంచారయ్య, దిలీప్, శేఖర్, లంకేష్, అక్బర్ ఖాన్, శోభన్ బాబులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శు లు జి. రాము తోట వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సి పి ఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు పేపేటి.సత్యం మాట్లా డుతూ సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

ఎఐపై కెఎల్యులో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని కంప్యూటర్ సైన్స్ రెగ్యులర్ విభాగం అధ్వర్యంలో జనరేటివ్ ఎఐ, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్పై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కత్రిమ మేధస్సు) ఒక మైలురాయి అని విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ అన్నారు. సదస్సుకు దాదాపు 160 మంది హాజరయ్యారని తెలిపారు. ముఖ్య అతిథులుగా మైసూర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.హేమంత్ కుమార్, కలకత్తాకు చెందిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి ప్రసాద్ ముఖర్జీ, చెన్నైలోని భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఆర్.ఎం.సురేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జనరేటివ్ ఎఐలో అత్యాధునిక పరిణామాలను అన్వేషించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధకులు, ఆవిష్కర్తలను, అభ్యాసకులను ఈ సదస్సు ద్వారా ఒకచోటకు చేర్చినట్లయిందన్నారు. కృత్రిమ మేధస్సులో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్షేత్రం, నూతన అభ్యాసం, చిత్రాలు, శబ్దాలు, మానవ-వంటి పరస్పర చర్యలను స్వయం ప్రతిపత్తితో సృష్టించగల యంత్రాల సామర్థ్యంపై దృష్టి పెడుతుందన్నారు. హెల్త్ కేర్, ఫైనాన్స్, క్రియేటివ్ ఆర్ట్స్, అంతకు మించిన విభిన్న రంగాల్లో దాని ధరఖాస్తులతో సహా, జనరేటివ్ ఎఐలోని వివిధ అంశాలను పరిశోధించడం ఈ సదస్సు లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ విసి డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్కుమార్, కన్వీనర్-డాక్టర్ కె.భానుప్రకాష్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-తాడేపల్లి : రెండ్రోజుల నుండి కురుస్తున్న వానలతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బోటుయార్డు, రామయ్యకాలనీ, డాల్డా కంపెనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు బురద పేరుకుపోయి చిత్తడిచిత్తడిగా తయారయ్యాయి. బోటుయార్డు వద్ద ఇళ్లల్లోకి నీరు చేరడంతో రాత్రులు నిద్ర లేకుండా జాగారం చేయాల్సి వస్తుందని పేదలు వాపోతున్నారు. తమకు శాశ్వత స్థలాలు కేటాయించి ముంపు బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. తాజా పరిస్థితులతదో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మున్సిపల్ అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు.

షార్ట్ఫిల్మ్ పోటీలకు 'కొండమ్మ' ఎంపిక

ప్రజాశక్తి-తాడేపల్లి : ప్రముఖ కవి దాశరధి శత జయంతి సందర్భంగా దాశరధి ఫిలిమ్ సొసైటీ హైదరాబాద్ నిర్వహిస్తున్న జాతీయస్థాయి తెలుగు షార్ట్ఫిల్మ్ పోటీలకు త్రినేత్ర ప్రొడక్షన్స్ ఉండవల్లి 'కొండమ్మ' షార్ట్ఫిలిమ్ ఫైనల్ పోటీలకు ఎంపికైనట్లు త్రినేత్ర ప్రొడక్షన్స్ రచయిత, దర్శకుడు గాదె నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన షార్ట్ ఫిలిమ్ల స్క్రూటినీ అనంతరం ఆరు షార్ట్ఫిలిమ్లను న్యాయనిర్ణేతలు ఫైనల్ స్క్రీనింగ్కు ఎంపిక చేసినట్లు చెప్పారు. అందులో కొండమ్మ షార్ట్ ఫిలిమ్కు స్థానం దక్కిందన్నారు. ఆదివారం హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ ఆడిటోరియంలో ఫైనల్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ప్రజాశక్తి-తిరువూరు, ఎ.కొండూరు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఇంటి పరిసరాలతో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం ఆమె తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లో పర్యటించారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భోజనం తింటే కడుపునొప్పి వంటి సమస్యలు వస్తున్నందున ఇంటి వద్ద నుండి క్యారేజీ తెచ్చుకుంటున్నామని కొంతమంది బాలికలు చెప్పారు. నాణ్యమైన బియ్యం సరఫరా చేయించేందుకు చూడాలని ఆమె డివైఇఓను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాడు నేడు పథకం కింద ఉన్న బిల్డింగులకు మరమ్మతు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులకు ప్రధాన కారణమైన కాలువల పూడిక తీత, పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేయించాలని డివిజన్, మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కొంతమంది అమలు చేయడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధు లు రాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు బాధ్యతగా తీసుకోవాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వాగుపై ఉన్న బ్రిడ్జి గతంలో కూలిపోవడంతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు ప్రస్తుత వర్షానికి వచ్చిన వరదకు కోతకు గురవడం తో సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు.



ఎ.కొండూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ఎ.కొండూరు మండలం చీమలపాడు పెద్ద తండా గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడ పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు పౌష్టికాహార కేంద్రాలని, ఇక్కడ నుండే చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన అక్షరజ్ఞానం పెంపొందించాలని అందుకు తగినట్లుగా అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది రూపకల్పన చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు తమకు అటవీ హక్కుల చట్టం ద్వారా సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే తండాలోని పాఠశాలను సందర్శించి పాఠశాలలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధారావతు లక్ష్మీ, డిఎంఅండ్‌హెచ్ఓ సుహాసిని, ఆర్డీవో మాధవి, తాహసిల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీకృష్ణ పరమాత్మ, డాక్టర్ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు అలవాల రమేష్‌రెడ్డి, గడ్డి కృష్ణారెడ్డి, వాసం మునియ్యా, భీమ నాయక్, పీకల నాయక్ జనసేన నాయకులు మనుబోలు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్ షేక్ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.



పల్సర్ 400 సిసి ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అధునాతన టెక్నాలజీతో రూపొందించిన బజాజ్ ఆటో పల్సర్ 400 సిసి బైకును శుక్రవారం ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ జోజి రెడ్డి ఆవిష్కరించారు.కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో బైక్ ను విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికపుడు వినూత్నంగా ద్విచక్ర వాహనాలను రూపొందించడంలో బజాజ్ ముందు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బజాజ్ వారిని అభినందించారు. బజాజ్ ఆటో లిమిటెడ్ సేల్స్ మేనేజర్ సదద్ భాషా మాట్లాడుతూ ఈ వాహనంలో 4 స్ట్రోక్ లిక్విడ్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజక్షన్ సిస్టమ్, 40 హర్స్ పవర్, అందించగల 6 స్పీడ్ గేర్ బాక్స్ ఈ వాహనం ప్రత్యేకత అన్నారు.డిజిటల్ బ్లూత్ కాల్ ప్రత్యేకత అన్నారు. ఈ వాహనం ఎక్స్ షోరూం ధర రూ.1,84,998గా నిర్ణయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, జనరల్ మేనేజర్ పద్మజ పాల్గొన్నారు.

కొండపల్లి సమస్యలపై సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ కమిషనర్ వై.శంకర్ నాయక్‌కు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాలిటీలో దోమలు, కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరాఉ. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షం కారణంగా కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. డ్రైనేజీ లలో పేరుకుపోతున్న చెత్త మరియు నీటితో నిండిన ఖాళీ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కరోనా సమయంలో పని చేసిన వర్కర్స్‌కు 20 మందికి రెండు నెలల జీతాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి మున్సిపాలిటీ కార్యదర్శి ఎం.మహేష్, ఎస్.బాష, బాడిశ వెంకటేశ్వరరావు, కె.బేబీ, ఎల్.పార్వతి, నారాయణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన డిసిపి

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా లా అండ్ ఆర్డర్ డిసిపిగా గౌతమి షాలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గౌతమి షాలి అనంతపురం జిల్లా ఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లాకు లా అండ్ ఆర్డర్ డిసిపిగా బదిలీ అయ్యారు. గతంలో విశాఖపట్నం డిసిపిగా, అనకాపల్లి ఎస్‌పిగా పని చేశారు.



వీకెండ్ వినోదంతో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రతి వారం వినోదంతో పాటు విజ్ఞానం అందించే జీ తెలుగు ఛానల్‌లో ఈనెల 21వ తేదీన వీకెండ్ వినోదం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఛానల్ రీజనల్ ప్రతినిధి కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు వీకెండ్ వినోదం పేరుతో ప్రత్యేక కార్యక్రమం అలాగే 20వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు డీడీ రిటర్న్ పేరుతో భూతాల బంగ్లా పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీటితో పాటు వినోద భరితమైన సినిమాలు రోజంతా ఆదివారం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేటి నుండి 'అపూర్వ' బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీలలో నగరంలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ హాల్ నందు 'అపూర్వ' బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఛాప్టర్ చైర్మర్ ఇ.విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలలో, ఇ ంటీరియర్స్‌లో ఇన్నోవేటివ్ ఉత్పత్తులు విస్తృత శ్రేణి కల్పించాలనే ఉద్దేశంతోనే అపూర్వ పేరుతో బిల్డింగ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈప్రదర్శణలో దేశ వ్యాప్తంగా ప్రముఖ ఆర్కిటెక్ట్స్ సంస్థలు తమ స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ప్రదర్శనతో పాటు ఆర్కిటెక్ట్స్ రంగంలో వస్తున్న నూతన అంశాలు, నిర్మాణాలలో నాణ్యత వివిధ అంశాలతో నిపుణులతో సెమినార్ కూడా రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన రెండు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు ఆర్కిటెక్ట్స్ రంగంపై అవగాహణ కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 21వ తేదీన పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించనునట్లు తెలిపారు. ప్రదర్శనను ఈనెల 20వ తేదీ ఉదయం రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. ఈసమావేశంలో ఎపి ఛాప్టర్ వైస్ ఛైర్మన్ వి.వేణుగోపాల్, ట్రెజరర్ కె. విజయానంద్ కుమార్, సెక్రటరీ ప్రొఫెసర్ కె.సుబ్బారావు, డాక్టర్ డి.శ్రీనివాస్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.



ఇసుక లారీ పట్టివేత

ప్రజాశక్తి-నందిగామ: ఆంధ్రా నుండి ఖమ్మం వెళుతున్న అక్రమ ఇసుక లారీని మదిర టౌన్ ఎస్ఐ సంధ్య అదుపులోకి తీసుకున్నారు. కంచికచర్ల మండలం మొగులూరు నుండి ఖమ్మం కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని వైస్సార్ సెంటర్ వద్ద మధిర టౌన్ ఎస్ఐ సంధ్య తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి మధిర టౌన్ పోలీసు స్టేషను లిమిట్స్‌లో పట్టుకున్నారు. షేక్ మహమ్మద్ పకీర్ తండ్రి పేరు జాన్, మొగులూరు, కంచికచర్ల అనే వ్యక్తి పైన 318(4) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరిగితే ఇక సహించేది లేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు రెగ్యులర్ మెడికల్ క్యాంపు

విజయవాడ: షుగర్, బిపి, ఫిట్స్, పక్షవాతం వ్యాధులకు ప్రజారోగ్య వేదిక, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి.జయప్రకాష్, వెలగా శ్రీనివాస్ తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడో ఆదివారం నిర్వహించే ఈ వైద్యశిబిరం పాయకాపురంలోని లహరి విద్యా మందిర్ స్కూల్లో ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 9.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు గోపాళం శివన్నారాయణ, చేకూరి మురళి, లంకా గౌతమ్ ముఖేష్, కె.యశోదమ్మ, బి.హర్ష, బి.దివ్య పాల్గొని రోగులను పరీక్షిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రెండు సరిపడా మందులన్నీ రూ.200కే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9490332600, 9490099986 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మెగా సరోవర్ ప్రాజెక్టు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

విజయవాడ గొల్లపూడిలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రాజెక్టు మార్కెటింగ్ మేనేజర్ వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఒక హెూటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రాజెక్ట్ బ్రోచర్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అమరావతి అభివద్ధిలో భాగస్వామి అవుతాయని మెగా సరోవర్ ప్రాజెక్టు మార్కెటింగ్ మేనేజర్ వెంకట్రావు అన్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపు అందుకుందన్నారు. అమరావతి రాజదాని రైతుల త్యాగం చిరస్మరణీయమన్నారు. అమరావతి నగరం ఒక విజనరీ సిటీ అని, 2030 నాటికి అమరావతి ఐకాన్ సిటీగా అవుతుందన్నారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సి ఆర్ డి ఏ మెగా వెంచర్ పరిధిలో మొదలు పెట్టామని, నగరంలోని గొల్లపూడి లాంటి ప్రైమ్ ఏరియాలో, ఈ వెంచర్ అందుబాటులో ఉంటుందన్నారు. సెక్రటేరియట్, విమానాశ్రయంకు కేవలం 30 నిముషాల్లో వెళ్లొచ్చన్నారు. రీమేక్స్ అనే అంతర్జాతీయ కంపెనీ



అనుబధంగా ఈ మెగా ప్రాజెక్టు ఉందన్నారు. రీమేక్స్ జూబ్లీ ప్రాపర్టీ పాట్నర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ 11 దేశాల్లో ఈరిమేక్ కంపెనీ ఉందన్నారు. ఎన్ ఆర్ ఐ లోకల్ ప్రజాల అవసరాలను, అవకాశాలను దష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టు రుపోయిందించామన్నారు. అమరావతిలో మంచి రియల్ ఎస్టేట్ అవకాశాలు వొచ్చాయన్నారు. ఇతర ప్రాంతాల వారు కూడా అమరావతి వైపు చూస్తున్నారు.గతంలో 6 వేలు గజం నుండి నేడు 40 వేలకు వెళ్లిందన్నారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో అమరావతి ఒక ఉన్నత స్థాయికి వెళ్తుందన్నారు.